ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



పూజలు చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అబిడ్స్: గుడిమల్కాపూర్‌లోని గుజరాతి పోచమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులను శుక్రవారం గుడిమల్కాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమాలు, భూమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్ట నాగేందర్, పవన్‌కుమార్, భుజేందర్, నిత్యానంద్, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జిగా ఇఫ్తెకార్ హుస్సేన్



జియాగూడ: వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జిగా సయ్యద్ ఇఫ్తెకార్ హుస్సేన్ శుక్రవారం ఎన్నికయ్యారు. యూఏఈ కన్సర్డ్ హోటల్‌లో వరల్డ్ కరాటే ఫెడరేషన్ కమిటీ జడ్జి పరీక్షల్లో పాల్గొని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా షిహన్ సయ్యద్ ఇఫ్తెకార్ హుస్సేన్ మాట్లాడుతూ..కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షులు హ్యాంషీ భరత్ శరం, ప్రధాన కార్యదర్శి షిహన్ సంజీవి ఝుంగ్ర, టీఎస్‌కేడీఏ అధ్యక్షులు మాషెస్ గౌడ్, షిహాన్ డి.విజయ్‌కుమార్ సహకారంతో విజయం సాధించినట్లు ఆయన తెలిపారు.

మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ప్రార్థనల్లో పత్థర్‌గట్టి కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ, మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలలు పాల్గొన్నారు. శుక్రవారం సామూహిక ప్రార్థనల సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఏడాదంతా అందుబాటులో 400 రకాల మామిడి పండ్లు



సాక్షి,సిటీబ్యూరో: ఏడాదంతా 400 రకాల మామిడి పండ్లు అందుబాటులో ఉంటాయని సల్మానీ సోదరులు తెలిపారు. కోహీర్ 300 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో సేంద్రీయ పద్ధతుల్లో ఈ తోటను పెంచుతున్నట్లు చెప్పారు. రాజేంద్రనగర్‌లోని హబ్‌సన్ ఆధ్వర్యంలో మామిడి పండ్ల ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం వారివురు విలేకర్లతో మాట్లాడారు. వివిధ రకాల పండ్లను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఐఏఎస్ అధికారి సుజాత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



గోల్కొండ: దోమల నివారణకు బల్దియా మలేరియా విభాగం అధికారులు డ్రోన్‌ను వాడుతున్నారు. దోమల ఉత్పత్తి కేంద్రంగా పేరుపడిన టోలిచౌకీ నదీమ్‌కాలనీని ఆనుకొని ఉన్న శాతం చెరువులో మలేరియా విభాగం అధికారులు శుక్రవారం డ్రోన్ సహాయంతో దోమల మందు పిచికారీ చేశారు.

విధులకు ఆటంకం: యువకుడిపై కేసు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36లోని నీరూస్ జంక్షన్‌లో శుక్రవారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్‌ఐ వి.అశోక్ వాహన తనిఖీలు చేస్తుండగా టీజీ 29ఏ 3965 నంబర్ గల బైక్‌పై ఓ యువకుడు రాంగ్‌రూట్‌లో వస్తుండగా ఎస్‌ఐ ఆపాడు. దీంతో యువకుడు ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా పోలీసు విధులకు ఆటంకం కలిగించగా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ఎస్ఐ బైక్‌ను స్వాధీనం చేసుకుని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రికి సురాభాండేశ్వర ఆలయం ముస్తాబు

- ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర
- నాటి నుంచి వైభవంగా శివరాత్రి మహోత్సవాలు
- అన్ని ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు



గౌండ్ల మఠం సురాభాండేశ్వర ఆలయం

జియాగూడ: పురానాపూల్ రహీంపురాలోని సురాభాండేశ్వర గౌండ్ల మఠం మల్లికార్జునస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఏర్పాట్లు మొదలయ్యాయి. 400 ఏళ్ల చారిత్ర గల ఈ ఆలయం ఎన్నో విశిష్టలతో వెలసింది. మూసీ నది ఒడ్డున వెలసిన శివాలయంలో గౌండ్ల మఠం శివాలయం ఎంతో ఖ్యాతి గాంచింది. నాడు గౌండ్ల మఠంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం సత్రాలు ఉండగా నిత్య అన్నదానం కొనసాగేది. భక్తులు ప్రతి యేటా శివరాత్రి జాతరను తిలకించేందుకు ఎడ్ల బండ్లు కట్టుకొని వచ్చేవారు. నేటికీ ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు అంతే వైభవంగా నిర్వహిస్తున్నారు.



ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం



సపరివార సమేత సురాభాండేశ్వరుడు..

ఆలయంలో మహా శివుడు సురాభాండేశ్వరుడుగా పూజలందుకుంటుండగా అమ్మవారు కాత్యాయనీ దేవి, సాక్షి గణపతి, కుమారస్వామి, నవగ్రహాలు, ఆంజనేయులు, నాగదేవత తదితర దేవాలయాలు ఉన్నాయి. సుమారు వంద ఏళ్ల క్రితం ఉత్సవాల నిమిత్తం వంట పాత్రలను శుభ్రపరుస్తుండగా వాటిపై గౌండ్ల మఠం రాసి ఉండడంతో నాటి గౌండ్ల మఠంగా గౌడ సంఘం వేడుకలను ప్రతి ఏటా నిర్వహిస్తుంది.

26 నుంచి మహా శివరాత్రి మహోత్సవాలు



గౌండ్ల మఠం సురాభాండేశ్వర ఆలయం శివరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచే సురాభాండేశ్వరుడికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అన్నపూజలు, సర్వదర్శనం, రాత్రికి పల్లకీ సేవా, మల్లికార్జున కల్యాణం, జాగరణ, భజనలు, నూతన జంటలతో అగ్నిగుండాలు, మరుసటిరోజు కొడిన్య భవనంలో మహా అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

– గొడిశాల నరేష్ గౌడ్, ధర్మకర్తల పాలకమండలి అధ్యక్షుడు

అన్ని సౌకర్యాలు కల్పించాం



ఆలయానికి నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. ముఖ్య అతిథులుగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, గౌడ సంఘాల ప్రతినిధులు హాజరవుతున్నారు.

– కొత్త నవీన్‌కుమార్ గౌడ్, ధర్మకర్తల పాలకమండలి ప్రధాన కార్యదర్శి

ఆలయ పునర్‌నిర్మాణం..

శిథిలావస్థకు చేరిన గౌండ్ల మఠం మల్లికార్జున ఆలయాన్ని కూల్చివేసి పునర్‌నిర్మించారు. ఆలయంలో పలు చోట్ల సురాభాండేశ్వర సపరివార సమేత విగ్రహాలను ప్రతిష్ఠించారు.

గొప్ప విద్వాంసుడు ప్రభాకర శర్మ



ప్రభాకర శర్మకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: సంస్కృత వాంగ్మయ ప్రాచుర్యానికి జీవితాన్ని అంకితం చేసిన దోర్బల ప్రభాకర శర్మ గొప్ప విద్వాంసుడని వక్తలు కొనియాడారు. శుక్రవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిష్యత్‌లో ప్రపంచ మాతృభాషా దినోత్సవ సందర్భంగా ప్రభాకర శర్మకు వేదాలంకర డాక్టర్ ముదిగంటి గోపాల్‌రెడ్డి సంస్కృతి పంటిత పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభకు అధ్యక్షత వహించి ప్రభాకర శర్మకు పురస్కారం కింద రూ.10 వేల నగదు, శాలువా, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సాంస్కతిక అకాడమీ సంచాలకులు డాక్టర్ పెన్న మధుసుధన్ ప్రసంగిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం సాంస్కతిక శాఖ ఆచార్యులుగా, శాఖ అధ్యక్షులుగా పలు పరిశోధన గ్రంథాల కర్తగా ముదిగంటి గోపాల్‌రెడ్డి చిరస్మరణీయులని ఆయన పేరుతో నెలకొల్పిన పురస్కారాన్ని మరో గొప్ప పండితుడైన ప్రభాకర శర్మకు ప్రదానం చేయడం సముచితమన్నారు. ఈ కార్యక్రమంలో జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

అఫ్జల్‌గంజ్: శివాజీ కేసరి కుస్తీ పోటీల నిర్వాహకులు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్ మాట్లాడుతూ..క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాల సహకరించి వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వాటర్‌బోర్డులో పాత బకాయిలు చెల్లించాలి

అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో పాత బకాయిలు చెల్లించాలని వాటర్ బోర్డు కాంట్రాక్టర్స్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి కొండా సురేఖకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు చేసిన వందలాది మంది కాంట్రాక్టర్లకు ఇంతవరకు పాత బకాయిలు చెల్లించలేదన్నారు. ఏఎంఎస్ విధానం ప్రవేశపెట్టి కాంట్రాక్టర్లను రోడ్డు పాలు చేశారన్నారు. ఇప్పటికైనా ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టర్లకు వెంటనే పాతబకాయిలు చెల్లించి ఆదుకోవాలని పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందించారు. తాను వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడి కాంట్రాక్టర్లకు తగు న్యాయం చేస్తానని పేర్కొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

దోమలను అరికట్టాలి

గోల్కొండ: దోమలను అరికట్టాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బల్దియా ఎంటమాలజీ అధికారులతో కలిసి గోల్కొండ నయాకీలా కందకానికి ఆనుకొని ఉన్న శాతం చెరువును పరిశీలించారు. శాతం చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం, గుర్రపు డెక్కను చూసి ఆయన చెరువు దుస్థితికి అధికారులే కారణమన్నారు. చెరువులు, కుంటలు, నాలాలు ఇదే విధంగా ఉంటే దోమలు విజృంభించవా అని ఆయన అధికారులను ప్రశ్నించారు. ప్రతి నిత్యం బల్దియా సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా నాలాలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయాలని సూచించారు. శాతం చెరువుతో పాటు బుల్కాపూర్ నాలా, గోల్కొండ ప్రహరీలను ఆనుకొని ఉన్న కందకాల్లో పిచ్చి మొక్కలు తొలగించి దోమలు వృద్ధి చెందకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

ఇంటింటి సర్వే పూర్తయ్యాకే కొత్త కార్డులు ఇస్తాం



బుస్రా సుల్తానా

నాంపల్లి: రేషన్ కార్డుల కోసం వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇంటింటి సర్వే పూర్తయ్యాక అందరికీ కొత్త రేషన్ కార్డులను అందజేస్తామని పౌర సరఫరాల శాఖ సర్కిల్-5 అసిస్టెంట్ కమిషనర్ బుస్రా సుల్తానా పేర్కొన్నారు. శుక్రవారం నాంపల్లిలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మీ సేవా కేంద్రాల ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించిన వారు సర్కిల్ కార్యాలయాలనికి చక్కర్లు కొట్టాల్సిన అవసరం ఉండదని తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు మీ ఇంటి వద్దకే వచ్చి విచారణ చేస్తారని చెప్పారు. ఇంటింటి సర్వే పూర్తయ్యాకే కొత్త రేషన్ కార్డులు జారీ అవుతాయని అన్నారు. సర్కిల్-5 పరిధిలో పేర్ల తొలగింపు(డీలిటెడ్) కోసం 8580 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటి వరకు 3361 దరఖాస్తులను సరిచేసినట్లు వివరించారు. ఇంకా చేయాల్సిన దరఖాస్తులు 5219 ఉన్నట్లు చెప్పారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, వెబ్‌సైట్‌లు తెరిచే ఉంటాయని, మీ సేవా కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు.

వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్: వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని గోషామహల్ బీఆర్ఎస్ నేత ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ బేగంబజార్ డివిజనల్ ఇంజినీర్‌ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీఈ ఎండీ ఫరహత్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. డీఈ సానుకూలంగా స్పదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గం పరిధిలో ఎక్కడ ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్ డీఈ ఫరహత్ అలీ కార్యాలయానికి వచ్చిన సాధారణ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చొరవ హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ బీఆర్ఎస్ మహిళా నాయకురాలు ప్రియా గుప్తా, జాంబాగ్ డివిజన్ మైనార్టీ విభాగం అధ్యక్షులు అహ్మద్, నాయకులు నరేష్ గౌడ్, భజన్‌సింగ్, డల్లు తదితరులు పాల్గొన్నారు.

హుక్కా పార్లర్‌పై పోలీసుల దాడి

చాంద్రాయణగుట్ట: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హుక్కా పార్లర్‌పై దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాంద్రాయణగుట్ట పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..చాంద్రాయణగుట్టకు చెందిన ఖాలేద్ బహమద్ ఎలాంటి లైసెన్స్ లేకుండా ప్రెస్టిజీయస్ హుక్కా పార్లర్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో చాంద్రాయణగుట్టకు చెందిన ఇమ్రాన్ పాషా హుక్కా సేవించేందుకు వచ్చాడు. సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాంద్రాయణగుట్ట పోలీసులతో కలిసి హుక్కా పార్లర్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వాహకుడు ఖాలేద్ బహమద్‌తో పాటు ఇమ్రాన్ పాషాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి హుక్కా కుండలు, పైపులు, ఫ్లేవర్లు మొత్తం రూ.30 వేల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



వేడుకల్లో ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, రాజ్‌నారాయణ ముదిరాజ్ తదితరులు



పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీనివాసాచార్యులు

అబిడ్స్: మాతృభాష వల్ల పూర్వీకుల సంస్కృతి సంప్రదాయాలకు అవగాహన కలుగుతుందని తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తమ్ పేర్కొన్నారు. శుక్రవారం అబిడ్స్ మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్, మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్ మాట్లాడుతూ..పసికందులకు తల్లిపాలు ఎంత ముఖ్యమో విద్యార్థులకు మాతృభాష అంత అవసరమన్నారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి సలహాదారులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..భాషా సంస్కృతులు ఒక సమాజ ఆర్థిక పురోగాభివృద్ధిని ప్రభావితం చేస్తాయన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ..40 ఏళ్లుగా ప్రజా సంక్షేమం కోసం తరచు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ జైన్, డాక్టర్ రవితేజ, బత్తుల హేమంత్, కళాశాల పీఆర్‌ఓ శ్రీకాంత్, ఎం.లింగమూర్తి పాల్గొన్నారు.

శ్రీనివాసాచార్యులకు తెలుగు భాషా సేవా పురస్కారం..

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు నల్లతీగల శ్రీనివాసాచార్యులకు తెలుగు భాషా సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా త్యాగరాజ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులకు ఆలయ చైర్మన్ కె.యుగంధర్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్ ఫౌండర్స్, భక్తులు అభినందనలు తెలిపారు.

సత్ప్రవర్తనతోనే సమాజంలో గౌరవం



బిందు స్వామి మహరాజ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: సత్ప్రవర్తనతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని బిందు స్వామి మహరాజ్ అన్నారు. శుక్రవారం ఆయనను తాళ్లగడ్డలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ సన్మానించారు. ఛత్రపతి శివాజీ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ ముగింపు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో బిందు స్వామి మహరాజ్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిందు స్వామి మహరాజ్ మాట్లాడుతూ.. హిందూ ధర్మం ఎంతో పవిత్రమైనదన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వంశీ, సాగర్, అవినాష్ తదితరులున్నారు.

కాచి కులస్తులకు ప్రభుత్వం అండ

గోల్కొండ: కాచి కులస్తుల ప్రభుత్వం అండగా ఉందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్‌లో కాచి సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాచి సంఘం ప్రధాన కార్యదర్శి తిలక్‌సింగ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాచి కులస్తులు వ్యాపారంలోనే కాకుండా విద్యా, రాజకీయ రంగాల్లో కూడా తమ సత్తాచాటాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కులగణనలో కాచి కులస్తులందరూ తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురాకుల కృష్ణ, జి.కిషన్ తదితరులున్నారు.



తిలక్‌సింగ్‌ను సన్మానిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

ఏటీఎం కేంద్రంలో చోరీకి యత్నించిన వ్యక్తి రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

గౌలిపురా: ఏటీఎం కేంద్రంలో చోరీకి యత్నించిన వ్యక్తిని మొఘల్‌పురా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనులు, ఎస్సైలతో నిందితుడి వివరాలను వెల్లడించారు. శాలిబండ రాజేష్ మెడికల్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో ఈ నెల 15న తెల్లవారు జామున 3.50 గంటలకు అలియాబాద్ జెండా ప్రాంతానికి చెందిన కాశీనాథ్ అలియాస్ కాశీ (24) చోరీకి యత్నించిన విషయం తెలిసిందే. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి కాశీనాథ్‌ను గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన మొఘల్‌పురా డీఎస్సై కె.యాదయ్య, పీసీలు పవన్ రాజ్, సాయికిరణ్, ఆయాజ్, హోంగార్డు ఇమ్రాన్‌తో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

ఏటీఎం కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి..

ఏటీఎం కేంద్రాల వద్ద అధిక నాణత్య కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ చంద్రశేఖర్ సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఏటీఎం కేంద్రాల వద్ద అధిక వెలుతురు ఉండేలా లైటింగ్ సిస్టిమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏటీఎంలలో ఎద్దైనా ట్యాపరింగ్ లేదా అనుమానాస్పద పరికాలను గుర్తించడానికి రెగ్యూలర్‌గా తనిఖీ చేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ వేడుకను పబ్లిక్‌గార్డెన్స్‌లోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల కళల శాఖ పూర్వ విద్యార్థి, తెలుగు విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళల శాఖ పూర్వ విద్యార్థులు, ఆచార్య కోట్ల హనుమంతరావు అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



ఆచార్య కోట్ల హనుమంతరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నేత్రపర్వం.. చెన్నకేశవ స్వామి కల్యాణం



చెన్నకేశవ స్వామి కల్యాణం చేస్తున్న వేద పండితులు



స్వామి వారిని దర్శించుకున్న బడంగ్‌పేట్ మాజీ మేయర్ పారిజాత

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయంభూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కల్యాణ మహోత్సవం శుక్రవారం నేత్ర పర్వంగా కొనసాగింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆనవాయితీలో భాగంగా చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ తరఫున ఎస్సై శ్రీనివాస్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బ్యాండ్ మేళాలను వాయించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈఓ శివ రుద్రప్ప, అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు, పాలక మండలి చైర్మన్ ఎ.మహేష్ గౌడ్, కమిటీ సభ్యులు బి.వందన, విజయలక్ష్మి, శ్రీధర్, శైలేష్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కల్యాణ మహోత్సవంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్, కాంగ్రెస్ చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా నియోజకవర్గాల ఇన్‌చార్జులు బోయ నగేష్, రవిరాజు, లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఏసీపీ రుద్ర భాస్కర్, నాయకులు అశోక్ ముదిరాజ్, జుర్కి రాజేందర్, గాజుల వెంకటరమణ, రాజు ముదిరాజ్, ప్రమోద్‌కార్వంకర్, నాగరాజు, అంబటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.